క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామంలోని 33కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా, చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధి, ఆస్నాద సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైద్య కళాశాల పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట శివారులో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను శనివారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పర్యవేక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో గుడిపేటకు వైద్య కళాశాల మంజూరు చేయించినట్లు, కేసీఆర్ దూరదృష్టితో జిల్లాకు ఒకటి చొప్పున వైద్య కళాశాలలు ఏర్పాటు చేయించగా రానున్న రోజుల్లో సామాన్యులకు సైతం మెరుగైన వైద్య సేవలు అందనున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు విజిత్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

952మంది భక్తుల హన్మాన్ మాలధారణ



మాలధారణ చేసుకుంటున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హన్మాన్ భక్తుల మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 952మంది భక్తులు హన్మాన్ దీక్షా మాలధారణ చేసుకున్నట్లు అర్చకులు తెలిపారు. అనంతరం గుట్టపై గల శ్రీ సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడి బజార్‌లో గల శ్రీశ్రీశ్రీ శివకేశవ సంజీవ ఆంజనేయస్వామి దేవాలయ 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నుంచి శనివారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు దిలీప్ శుక్లశర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైనట్లు, మహా అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు తెలిపారు.

సైన్యానికి మద్దతుగా పూజలు



కన్నెపల్లి హనుమాన్ ఆలయంలో పూజలు

భీమారం/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాదులతో పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా శనివారం భీమారం, కన్నెపల్లి, హాజీపూర్ మండలాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని భగవంతున్ని కోరారు. జై జవాన్.. జై భారత్‌మాత.. అంటూ నినాదాలు చేశారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కన్నెపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్ది రమేశ్

చెన్నూర్: యాదవుల అభివృద్ధి సంక్షేమం కోసం ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుల ఆధ్వర్యంలో ఏర్పడ్డ భారత యాదవ సమితి పలు కార్యక్రమాలు చేసినందుకు, ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ పట్టణానికి చెందిన సిద్ది రమేశ్‌యాదవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యాదవ సంఘం విద్యావంతులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

కోతులతో వేగేదెట్టా..!

- పట్టణంలో ఆగని కిష్కింధకాండ
- అర్ధంతరంగా ఆగిపోయిన ఆపరేషన్ మంకీస్
- ప్రారంభించి వదిలేసిన అధికారులు
- తరలించాలంటున్న పట్టణ ప్రజలు



స్టేడియం సమీపంలో కోతుల గుంపు

రామకృష్ణాపూర్: కోతుల బెడద ఎక్కువైపోయింది. పట్టణంలోని పలు కాలనీల్లో స్వైర విహారం చేస్తూ నానా హంగామా సృష్టిస్తున్నాయి. ఇంటి రేకులపై, ఇళ్ల కప్పులపై గెంతుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంట్లో చొరబడి నిత్యావసర సరుకులను చిందరవందర చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ నడిబొడ్డున ఉన్న ఇళ్లు, క్వార్టర్లలో వీటిగోల భరించలేని స్థితిలో ఉంది. కొద్ది రోజుల క్రితం కోతులను పట్టుకునే ప్రయత్నాలు (ఆపరేషన్ మంకీస్) జరిగినా.. అర్ధంతరంగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో తిరిగి యధాతథ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రక్రియ నిలిపివేతతో మునుపటి లాగానే కోతులు విచ్చలవిడిగా తచ్చాడుతున్నాయి. మరోసారి కోతుల పట్టివేతకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటేనే తమకు ఉపశమనం కలుగుతుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో కోతులు వీరంగం సృష్టిస్తున్నాయి. ఆ ఏరియా... ఈ ఏరియా అనేదేమి లేకుండా అన్ని కాలనీల్లో హంగామా సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఠాగూర్ స్టేడియం, షిర్కే క్వార్టర్స్, సీ–2 క్వార్టర్స్ ప్రాంతంలో ఇప్పుడు కోతుల అలజడి మరీ తీవ్రతరం అయిపోయింది. వాహన చోదకులే కాకుండా పట్టణంలోని ఆవాసాల్లో ఆందోళనకర పరిస్థితులకు కోతులు కారణం అవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. నేరుగా ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. చిన్నపిల్లలపై ఎగబడుతున్నాయని, వాటి భయానికి బయటకు రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని కాలనీలలో బెడద తీరింది...

కోతుల స్వైర విహారం నేపథ్యంలో మున్సిపల్ అధికారులు కొద్ది రోజుల క్రితం చర్యలు చేపట్టారు. కొంతమంది కోతులను పట్టే వారిని తీసుకొచ్చి కొంత ప్రశాంతత కల్పించారు. ప్రత్యేక బోనుల ద్వారా కోతులను పట్టుకుని దూరంగా అటవీ ప్రాంతంలో వదిలేసి వచ్చారు. దీంతో పట్టణంలోని రామాలయం, ఏ–జోన్, సీహెచ్‌పీ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద చాలా వరకు తగ్గింది. ఇదే తరహాలో అన్ని కాలనీల్లో కోతులు పట్టే ప్రక్రియ చేపడుతారని భావించినప్పటికీ అర్ధంతరంగా నిలిపివేశారు. కోతుల పట్టే వారు అందుబాటులో లేకపోవటమా లేక ఇంకేమైనా కారణాల అనేది స్పష్టత లేకుండానే పట్టివేత ప్రక్రియ నిలిచిపోయింది.

చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నా పట్టించుకోరా..?

కోతుల పట్టివేత చర్యలకు క్యాతనపల్లి మున్సిపల్ అధికారులు మరోసారి ఉపక్రమిస్తేనే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఠాగూర్‌స్టేడియం, గంగాకాలనీ, హనుమాన్‌నగర్, జవహర్‌నగర్, సీ–2 క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో చిన్నపిల్లలు ఎక్కువగా స్టేడియానికి వస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలు బిక్కుబిక్కుమంటూ క్రీడా మైదానానికి వచ్చే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఏకంగా మీద పడి కోతులు దాడి చేస్తున్నా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణ ప్రశాంతత కోసం కోతుల బెడద లేకుండా చూడాలని విన్నవిస్తున్నారు.

కోతులను తరలిస్తాం



మున్సిపల్ యాక్ట్ ప్రకారం కుక్కలు, కోతుల నివారణకు తప్పకుండా చర్యలు తీసుకోవాలి. క్యాతనపల్లి పరిధిలో కోతుల బెడద తీవ్రంగానే ఉంది. ఈ విషయం ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే కోతుల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– జి.రాజు, మున్సిపల్ కమిషనర్

అధునాతన చికిత్సతో స్టంట్ వేసిన వైద్యులు



చికిత్స చేసిన పేషెంట్‌తో వైద్య బృందం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టచ్ ఆసుపత్రిలో ఐవీయూఎస్ కెమెరా గైడింగ్ అనే అధునాతనమైన చికిత్స ద్వారా సర్జరీ లేకుండా స్టంట్ వేసినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బెల్లంపల్లికి చెందిన సరోజ తీవ్రంగా ఛాతిలో నొప్పితో ఆసుపత్రికి రావడంతో కార్డియాలజిస్టు డాక్టర్ బి.రాజేశ్, వైద్య బృందం పరీక్షలు జరిపి రోగికి హార్ట్‌ఎటాక్ వచ్చిందని నిర్ధారించి, ఆంజియోగ్రాం పరీక్షతో గుండెలోని మెయిన్ రక్తనాళంలో మొదటి భాగంలో 95శాతం బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాల్సిన పరిస్థితిలో తమ ఆసుపత్రిలోనే ఐవీయూఎస్ కెమెరా గైడింగ్‌తో అధునాతనమైన చికిత్స చేసినట్లు తెలిపారు. టచ్ ఆసుపత్రిలో అన్ని రకాల అధునాతనమైన వైద్య సేవలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ పల్లెబాట యాత్ర విజయవంతం చేయండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 11న ఆదివారం నిర్వహించే 'బీసీ పల్లెబాట యాత్ర' విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పరికిపండ్ల అశోక్, వడ్డేపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ ఆధ్వర్యంలో బీసీ పల్లెబాట కార్యక్రమం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని బీసీ నాయకులు విద్యార్థులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, బీసీ మద్దతుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గుమ్ముల శ్రీనివాస్, గజెల్లి వెంకటయ్య, లతీఫ్, హరీష్‌రాజు పాల్గొన్నారు.

భారత ఆర్మీకి మద్దతు...

ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం తెలుపుతూ జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. పాకిస్తాన్ ముష్కరుల కాల్పుల్లో మృతిచెందిన భారత సైనికుడు మురళీనాయక్ మృతికి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ, హరీష్‌రాజు, వడ్డేపల్లి మనోహర్, పరికి పండ్ల అశోక్, గుమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాదారులు రిమాండ్



వివరాలు వెల్లడించిన సీఐ ప్రమోద్‌రావ్

మంచిర్యాలక్రైం: రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ ప్రమోద్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెదిన పాస్తాం నరేశ్, రాంనగర్‌కు చెందిన చింతల మోజేష్ ఇంట్లో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నరేష్ ఇంటి వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న రూ.30వేలు విలువైన బియ్యం, రాంనగర్‌లోని మోజేష్ ఇంటి వద్ద మహేంద్ర బొలేరోలో రూ.70వేలు విలువైన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పోలీసుల చూసి ఇద్దరూ పారిపోవడంతో శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాయక్‌పోడ్ హక్కులు సాధించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జన్నారం: ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కులను సాధించుకోవాలని కమిటీ జిల్లా అధ్యక్షుడు మారినేని భూమేష్ అన్నారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాటం చేసిన మద్ది రామ్‌చందర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. దండేపల్లి మండలంలోని కుమురం భీం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయల్దేరి తిమ్మాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరి జన సంఘం జెండా ఆవిష్కరించారు. నాయక్‌పోడ్ కులస్తుల కోసం మద్ది రాంచందర్ చేసి న త్యాగం మరువలేనిదన్నారు. ప్రతి ఒక్క రూ పోరాటం చేసి హక్కులను సాధించుకో వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్ పోడ్ నాయకులు భీమిని సంజీవ్, అశోక్, ఆరె దుబ్బరాజం, బాపన్న, జితేందర్, వెంకయ్య, పోషన్న, అర్జున్, రాజన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీల ఎన్నిక

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని పార్టీ పరిశీలకులు సంగపు రాజు పేర్కొన్నారు. మందమర్రి పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. మండలాల కమిటీలను ఎన్నుకున్నారు. మందమర్రి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వాసాల సంపత్, మండల అధ్యక్షుడిగా పెరుమళ్ల వెంకటేష్, మందమర్రి పట్టణ ప్రధాన కార్యదర్శిగా కారం రాజు, మహిళ అధ్యక్షురాలిగా ఆర్కే జయ, ప్రధాన కార్యదర్శిగా జుపాక శ్యామల, ఉపాధ్యక్షుడు నాగు రంజిత్, జైపూర్ మండల అధ్యక్షుడిగా నిమ్మ సురేష్, ఉపాధ్యక్షుడు మహేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, కవిత, రాజేష్, సత్యనారాయణ, కళావతి, రాణి, వరలక్ష్మి, శారద తదితరులు ఉన్నారు.

చెట్లకొమ్మల నరికివేత

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలోని భీమారం జోడువాగుల వద్ద చెట్ల కొమ్మలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయని ఆయా గ్రామాలకు చెందిన యువకులు, ప్రజలు ఎస్సైకి సమస్య విన్నవిచారు. వెంటనే స్పందించిన ఎస్సై శ్వేత శనివారం ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడి తొలగింపజేశారు. బస్టాండ్ సమీపంలో కూడా డివైడర్ వద్ద గల పరిసరాల పరిశుభ్రతలో భాగంగా చెత్తని తొలగించే పనులు చేపట్టారు. ఈ మేరకు ఎస్సైని ప్రయాణికులు, స్థానిక ప్రజలు అభినందించారు.

నాయకపుగూడలో మద్ది రాంచందర్ వర్ధంతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో శనివారం ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం వ్యవస్థాపకుడు మద్ది రాంచందర్ వర్ధంతిని ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తట్ర భీంరావ్, కాసిపేట మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ మండలాధ్యక్షుడిగా సంపత్‌కుమార్

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారం గ్రామానికి చెందిన సూరం సంపత్ కుమార్ బీజేపీ మండలాధ్యక్షుడిగా రెండోసారి నియమాకమయ్యారు. మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి బద్దం లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకొని నియమాకపత్రం అందించినట్లు తెలిపారు.

గిరి ప్రదక్షిణ విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి గుట్టపై ఈ నెల 12న నిర్వహించే శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర, నరసింహ స్వామి గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాసు కాంతయ్య అన్నారు. గుట్ట వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పాడేటి శ్రీనివాస్ గౌడ్, మనోహర్, పాదం శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, హరగోపాల్, రాజు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి

భీమారం: మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా కల్లి తండాకి చెందిన మురళీనాయక్ యువకులు ఘనంగా నివాళులర్పించారు. మౌనం పాటించి మురళీనాయక్ కుటుంబానికి అండగా నిలుస్తామని ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే బంద్‌కు మద్దతు తెలిపారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



నడక సాగిస్తున్న అటవీ అధికారులు, స్థానికులు

బెల్లంపల్లిరూరల్: నడకతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి నీలగిరి ప్లాంటేషన్‌లో 'వనంలో మనం –ఆరోగ్యం కోసం నడక' పిలుపుతో ఐదు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై నడక పోటీలను ప్రారంభించి పోటీల్లో పాల్గొన్నారు. నడక సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఉదయం క్రమంతప్పకుండా నడక సాగించాలని ఆమె సూచించారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందన్నారు. విరివిరిగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. నీలగిరి చెట్లతో అధిక మొత్తంలో ఆక్సిజన్ లభిస్తుందని, కాగితం తయారవుతుందని సూచించారు. అనంతరం నడక పోటీల్లో ప్రథమ స్థానంలో ఎస్.కిరణ్, ద్వితీయ స్థానంలో అఖిల్, తృతీయ స్థానంలో తిరుపతి నిలువగా వారిని అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ప్లాంటేషన్ మేనేజర్లు సురేష్ కుమార్, సునీత, లక్ష్మణ్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ నరేష్, అటవీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వారంలో పూర్తిచేయాలి

- డీఆర్‌డీవో కిషన్



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి: వరిధాన్యం కొనుగోళ్లను వారంలోగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. దండేపల్లి మండలంలోని ముత్యంపేట, కొర్విచెల్మ, రెబ్బనపల్లి, నెల్కివెంకటాపూర్, మాదాపూర్, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు కాబట్టి, కొనుగోళ్లను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు లావణ్య, తిరుపతి, జనార్దన్ ఉన్నారు.

'భూభారతి'పై రెవెన్యూ సదస్సు



సదస్సులో పాల్గొన్న అధికారులు

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సదానందం మాట్లాడుతూ.. గ్రామాల్లో గల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రెవెన్యూ శాఖ పరిష్కరించనుందని తెలిపారు. ధరణి చట్టం ద్వారా రైతులు నానా ఇబ్బందులు పడ్డారని, దీనిని గుర్తించిన ప్రభుత్వం కొత్త చట్టాలను ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. 94మంది రైతులు అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

పాతమంచిర్యాల: ఈ నెల 20 న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో శనివారం ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకలు సంకె రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మపున్నం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

మందమర్రిరూరల్: నాయీబ్రాహ్మణులకు, రజకులకు అందిస్తున్న 250యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. జీవో 2 ప్రకారం ప్రభుత్వం రజక, నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు 250యూనిట్ల విద్యుత్‌ను అందిస్తుందన్నారు. అందుకు సంబంధించి విద్యుత్ శాఖకు రూ.172కోట్లు బిల్లులను చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించి, వృత్తిదారులపై భారం తగ్గించడంతో పాటు విద్యుత్ అధికారుల నుంచి వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగేపల్లి వెంకటేష్, కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సంగెపు హన్మంతు, ముస్కే చందు, ఓదెలు, రాజమల్లు, బాలయ్య, సమ్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్: జమ్ముకశ్మీర్‌లో భారత జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న తాండూర్ మండల వాసి పుప్పాల లక్ష్మణ్‌కు కమలనాథులు వీర తిలకం దిద్ది సాగనంపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మణ్‌కు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జవాన్ లక్ష్మణ్ ఇటీవల సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీ నుంచి పిలుపు రావడంతో విధుల్లో చేరడానికి సిద్ధమయ్యారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారత జవాన్‌లకు దేశ పౌరులు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు విజయ్‌కుమార్, తుకారాం, పుట్ట కుమార్, శ్రీనివాస్, మోహన్, మురళీ, శోభన్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా కృష్ణకాలనీలోని శాంతి స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఆ యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు శనివారం జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, కోశాధికారి నాగభూషణం, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, సంపత్, గొల్లపల్లి రామచందర్, ఫిట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట 2గని కార్మికులకు ఇన్సెంటివ్, బోనస్‌లు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిలో పని చేస్తున్న కార్మికులకు మొదటి సారిగా ఇన్సెంటివ్, బోనస్‌లు అందించనున్నట్లు ఐఈడీ, డీజీఎం రాజన్న తెలిపారు. గనిపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గనిలో బొగ్గు ఉత్పత్తిని ఘనసీయంగా పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఉద్యోగుల అంకిత భావాన్ని గుర్తిస్తూ ఇన్సెంటివ్, బోనస్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ కేటగిరిలకు చెందిన ఉద్యోగులకు ఎలా వర్తిస్తుందో వివరించి, అవగాహన కల్పించారు. సమావేశంలో గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, రక్షణాధికారి రవి శంకర్, సంక్షేమాధికారి భార్గవ్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మందమర్రిరూరల్: పట్టణంలో ఈ నెల 18న నిర్వహించే సీపీఐ 11వ మహాసభలు విజయవంతం చేయాలని శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సలేంద్ర సత్యనారాయణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.